# ఆశల పాశం

## ఎ.పుష్పాంజలి

అతని శరీరం కంపిస్తూ ఉంది. కాళ్ళు ఒణుకుతున్నందువల్ల నిలబడలేకుతున్నాడు. చేతిలో కర్ర అతనికెంత మాత్రం ఊతనివ్వడంలేదు. ఎక్కడైనా కూర్చోడానికి తపించిపోతూ ఎదురుగా తేరిపారజూశాడు.

ఆకాశానికి నిచ్చెన వేసినట్టున్న చర్చిమెట్లు కనిపించాయ్. ఎలాగోలా అక్కడికి చేరి అతికష్టంతో కిందిమెట్టు మీద చతికిలబడ్డాడు.

చర్చిలోపల ప్రార్థనలు జరుగుతున్నాయ్. హృదయాన్ని కరిగించే భక్తి గీతమేదో ఆలపిస్తున్నారు. ఆ గీతంలో ఒలుకుతున్న కరుణరసం సరాసరి జగన్నాథం హృదయాన్ని తాకింది. అర్థంకాకపోయినా అతని మదికదెంతో సాంత్వన నిచ్చింది. మూసుకున్న కళ్ళల్లో నుంచి కన్నీరొలకసాగింది.

''భక్తిరసంలో ఉన్న మహాత్యం ఇదే కాబోలు! దేవుడున్నాడో లేడోగాని, మనిషి తన బరువు బాధ్యతలన్నీ అతనిపై మోపుతాడు. తన హృదయాన్ని కరిగించే, తను నమ్మే ఆ దేవుని పాదాలను అభిషేకిస్తాడు. ఆ విధంగా హృదయ భారాన్ని తగ్గించుకుంటాడు'' అనుకున్నాడు జగన్నాథం.

దేవుణ్ణి నమ్మి విసిగిపోయిన అతని ఆలోచనలు ఈ విధంగానే సాగుతున్నాయిామధ్య.

''లేకుంటే తనెన్ని గుళ్ళు తిరిగాడు? ఎన్ని అభిషేకాలూ, అర్చనలూ చేయించాడు! ఒక్క దేవుడైనా తనని కరుణించాడా? తన ఆరోగ్యం బాగు చేశాడా?'' అను కున్నాడు.

ఆ ఊళ్ళోనే పుట్టి అక్కడే పెరిగిన జగన్నాథం జీవితంలో ఏనాడూ ఆ చర్చి మెట్లపై కూర్చోలేదు. పైగా మతకలహాల్లో యధాశక్తి పాల్గొన్నాడు. జీవితమంతా ఆ చర్చినీ అక్కడి ప్రజలను ద్వేషిస్తూ గడిపాడు. కానీ ఈవేళ అతని మనసునూ, జీవితాన్నీ అంతులేని చీకటి ఆవరించి ఉంది. వెలుగు కూడా అతని కళ్ళకి చీకటి లాగే కనిపిస్తోంది.

అట్లా ప్రశాంతంగా కళ్ళు మూసుకొని, అలా ఆ చర్చిమెట్లపై కూచోడం అతని ఏభై అయిదేళ్ళ జీవితంలో ఇదే మొదటిసారి.

లోపల ప్రార్థనలు ముగిసినట్టున్నాయ్. అందరూ వెలుపలికొస్తున్నారు. ముందుగా మెట్లు దిగిన అతని క్లాస్ మేట్ జోసెఫ్, చివరి మెట్టుమీద చతికిలబడివున్న జగన్నాథాన్నీ, అతని మూసిన కళ్ళనీ చూసి ఆశ్చర్యపోతూ ''జగన్నాథం గారూ...'' అని మెల్లగా పిలిచాడు.

చిన్నప్పట్నించీ డిగ్రీ వరకూ కలిసి చదివినా కూడా జగన్నాథాన్ని ఇలా సంబోధించడమే తెలుసు జోసెఫ్‌కు. పైగా అతను ఎప్పుడూ తన్నెలా ఈసడించుకునేవాడో జోసెఫ్ ఎప్పటికీ మర్చిపోలేడు.

మెల్లిగా కళ్ళు తెరిచిన జగన్నాథానికి జోసెఫ్‌ని ద్వేషించాల్సిన అంశమేదీ గుర్తురాలేదు. అతనందిస్తున్న చేతుల్ని మనసారా అంగీకరించాడు.

జోసెఫ్ ఆసరాతో వస్తున్న జగన్నాథాన్ని చూసి అతని భార్యా మిగతా ఇంటివాళ్ళూ, ఆశ్చర్యపోయారు. వాళ్ళ ముఖాలు చూసిన జోసెఫ్ వాకిట్లోనే ఆగిపోయి ''బాబు గార్ని తీసుకెళ్ళండమ్మా'' అన్నాడు.

''కారులో వెళ్ళమంటే మొండికిబడి కాల్నడకన బయల్దేరాడు'' అన్నది జగన్నాథం భార్య కౌసల్యమ్మ. ఆమె తనలో తను అనుకుందో, జోసెఫ్‌కే చెప్పిందో ఎవరికీ అర్థంకాలేదు.

పనివాడు రంగయ్య జగన్నాథాన్ని నడిపించుకుంటూ తీసుకెళ్ళి వరండాలోని వాలుకుర్చీలో కూచోబెట్టాడు. అక్కణ్ణించి జగన్నాథం కృతజ్ఞతగా చూసిన చూపు జోసెఫ్ మనసుని కాస్త చల్లబరచింది.

''జగన్నాథం ఎంత అందగాడు! ఎంత ఆస్తిపరుడు! ఎంత డాబూ దర్జాలతో వెలిగిపోయేవాడు! ఎంత పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నాడు, ఈ మల్లెల చెరువు చుట్టుపక్కల అతనికెంత పరపతి ఉంది! ఎన్నుండి ఏంలాభం? ఎంత విచిత్రమైన జబ్బు

## అశ్రుకవితాభి వందనం!

ఆంధ్రుడైనాడు
అకుంఠిత దీక్ష వహించి
అమరుడైనాడు
ఆంధ్రరాష్ట్ర మందించి
మహనీయుడైనాడు
కృషితో నాస్తి దుర్భిక్షం అన్న బాటలో పయనించి
సమతమమతల బాటలో
స్వరాష్ట్రాన్ని సాధించి
అందరిచే 'సెహభాష్!' అనిపించి
జగతియావత్తుకూ ఆదర్శప్రాయుడై
గాంధీజీ తదుపరి
మరో గాంధీయై నిలిచాడు
అందుకే నాడూ నేడూ ఎన్నడూ
నవంబరు 1న ఆంధ్ర రాష్ట్ర దినోత్సవం నాడు
పూజ్యుడై కీర్తింపబడుతున్నాడు
ఆంధ్రుల చరితను నిలిపి
ఆంధ్రుల ఘనతను తెలిపి
ఇంతటి ఘనకీర్తిని బడసిన
మా పొట్టి శ్రీరాములయ్యా!
అందుకే అందుకో నీకై నేనందించే
ఈ అశ్రుకవితాభినందన చందనం!

దోసపాటి సత్యనారాయణ

చేసింది జగన్నాధానికి? మనిషి ఆధీనంలో లేనిదేదో అతన్ని ఆడిస్తూ ఉంటుంది. అంతవరకూ అన్నీ తన ఆధీనంలోనే ఉన్నాయన్న భ్రమలో ఉంటాడు మనిషి'' తనింటికి సాగి పోతూ అనుకున్నాడు జోసెఫ్.

''ఏందయ్యా! ఇంకెవురూ తోడు దొరకలేదా ఏం? అతన్ని తీసుకొచ్చావు'' అన్నది కౌసల్యమ్మ.

''ఏం! అతను మనిషి కాదా? నీ సొమ్మేం పోయింది?'' అన్నాడు జగన్నాధం.

''అయ్యో రామా! నీకు వొళ్లు బాగాలేనప్పట్నుంచీ మొండివాదం ఎక్కువైంది. నేనిప్పుడేమన్నా?'' అన్నది కౌసల్యమ్మ.

''అవును. ఉన్నదున్నట్టు చెప్తే మొండివాదంలాగే ఉంటది'' అన్నాడు. కౌసల్యమ్మ గొణుక్కుంటూ లోప లికి పోయింది.

భార్య ధోరణి ఇటీవల చాలా మారింది. ఆ ధోరణి అతను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ఏమీ మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. ''ఏది చెప్పినా దీనికి లెక్కేలేదు. ప్రతి దానికి ఎదురుచెప్తూ, నామీదే పెత్తనం చేస్తా ఉంది'' అను కున్నాడు.

అప్పుడే రెండు కొత్త కుండలు పట్టుకుని లోపలి కొచ్చాడు కుమ్మరి గంగస్వామి.

''అమ్మయ్యా. రెండు కొత్తకుండలు గావాలని సెప్ప పింవుట! ఈటిని నిన్ననే ఆములో నుంచి దీశాం. తీసు కోండి'' అన్నాడు. గంగస్వామి కొత్త కుండలు చూపుతూ.

కౌసల్యమ్మ కోడలు అనూరాధని పిల్చి ''వాటిల్లో నీళ్ళు పోసి చూడు. అతనికి చిల్లరిచ్చి పంపెయ్'' అన్నది.

''అట్టాగే అత్తా!'' అంటూ ఆ కుండలందుకుంది. చిల్లర నోట్లు తెచ్చి గంగస్వామి చేతిలో పెట్టబోయింది కోడలు.

గంగస్వామి ఆ నోట్లు తీసుకోకుండా ''ఉణ్ణీలేమ్మా'' అన్నాడు.

''అదేంది! దాన్లమీద బతికేవాడివి. తీసుకో గంగ సామీ'' అన్నది గడ్డివాములో నుంచి గడ్డిలాగుతున్న కౌసల్యమ్మ.

తలొంచుకున్న గంగయ్య నానుస్తూ ''అది గాదెమ్మా. మరి...'' అన్నాడు.

''ఆఁ... ఏంది?'' అన్నది కౌసల్యమ్మ విసుగ్గా.

''పిల్ల పెళ్ళి పెట్టుకున్నానమ్మా. అంతా సరుదు బాటైంది. ఇంగ ఐదువేలు మాత్తరం తక్కువైంది. పత్రం రాసిస్తా. అందరికన్నాక రూపాయ ఎక్కువేసిత్తా. ఎట్ట యినా సరుదుబాటు సెయండమ్మా. నాకు శనిక్కాయ రాగానే ఇచ్చేస్తా. అంతా తమ ధర్మం. కాస్త పున్నం కట్టు కోండి'' అన్నాడు గంగసామి దీనంగా.

''నీకు తెలిందేముంది గంగసామీ? ఆయనకి వొళ్ళు బాగలేనప్పట్నించీ మా పాట్లు పాట్లుగావు బెంగుళూరు నుంచి అయిద్రాబాదు వొరకీ ప్రతి ఆస్పత్రి మెట్లు ఎక్కిందీ దిగిందిగా ఉండాం. మంచినీళ్ళ మాదిరి దుడ్లు

కర్సయితా ఉండయ్ గాని మనిసి మాత్రం నయం గాల. ఆదాయాలు గూడా ఆడికాడికే ఉండే'' నిట్టూరుస్తూ అంది కౌసల్యమ్మ.

''ఎంత బాగా అబద్ధాలు చెప్తావుంది కౌసల్య! అమెరికానుంచి తన పెద్ద కొడుకు చైతన్య ఇంటి కర్చులకోసం తన ఆరోగ్యం కోసం వేలకు వేలు పంపుతున్నాడు'' అనుకున్నాడు జగన్నాథం.

''అదిగాదమ్మా! శనిక్కాయ రాంగనే...'' నసుగుతున్నాడు గంగసామి.

''యాన్నించొస్తాయయ్యా శనిక్కాయలు? రెండేళ్ళుగా వానలేడుండాయి? ఏసిన చేన్లు ఏసినట్టు ఎండిపోతావుండాయ్. నాకు తెలియందా?'' కసిరింది కౌసల్యమ్మ.

తన దగ్గరున్న పదివేలు జ్ఞాపకం చేసుకున్నాడు జగన్నాథం అందులో ఐదువేలు గంగసామికిచ్చి ఆదుకుంటే పోయేదేమీ లేదు. అనుకుంటూ ''ఇట్లారా గంగసామీ'' అన్నాడు.

నిరాశతో వెనక్కి వెళ్ళిపోతున్న గంగసామిలో అతని పిలుపు ఏదో కొత్తాశ రేపింది. వెనక్కి తిరిగొచ్చి చేతులు కట్టుకొని జగన్నాథం ఎదురుగా నిలుచున్నాడు.

జేబులోనుంచి ఐదు వెయ్యి రూపాయల నోట్లు తీస్తూ ''ఇదో, తీస్కో. పిల్ల పెళ్ళి చేస్కో'' అన్నాడు జగన్నాథం.

చాటంత ముఖంతో ఆ నోట్లందుకుంటూ కౌసల్యమ్మవంక అనుమానంగా చూశాడు గంగసామి. అక్కడే వున్న ఆమె కోపంతో మండిపోతూ ఉంది. కాస్త తమాయించుకొని, వంగి, జగన్నాథం కాళ్ళంటుకున్నాడు.

''అయ్యన్నీ ఏమవసరంలే'' కాళ్ళు వెనక్కి తీసుకుంటూ చెప్పాడు జగన్నాథం.

''అయ్యా! పత్రం...''

''ఏమీ అవసరంలేదులే. అసలీ డబ్బులు నువ్వు నాకియ్యానవసరం లేదు'' అన్నాడు జగన్నాథం.

ఇదంతా నివ్వెరపోయి చూస్తోంది కౌసల్యమ్మ.

గంగసామిని వెళ్ళనిచ్చి ''దుడ్లు చెట్లక్కాస్తావుండాయా? నేను లేదండమేందీ? నువ్వియ్యాడమేంది?'' అంది.

''నా ఇష్టం!''

''ఇదంతా మంచిగ్గాదు''

''ఇంతకన్నా చెడ్డేం జరుగుద్దిలే''

''ఆడ చూస్తే ఆస్పత్రులెదాన వేలు పోస్తావుండాం. ఈడ జూస్తే చెల్లపెంకుల్లాగా పారేస్తావుండావు. పోసుకో'' అని విసురుగా లోపలికెళ్ళిపోయింది.

ఆమె గొణుగుడంతా అతనికి వినిపిస్తున్నా వినిపించనట్టే ఉండిపోయాడు. ప్రస్తుతం అతని మనఃస్థితి వాళ్ళెవరికీ అర్థంకాదు. ఇంక బ్రతకడన్న స్థిరనిశ్చయాని కొచ్చిన వాడూ లోకాశలన్నీ చంపుకున్నవాడూ, ఈ ప్రపంచానికి సంబంధించిన అనేక ఆర్థిక లావాదేవీలమీద నమ్మకం లేనివాడూ ఏవిధంగా ప్రవర్తిస్తాడో జగన్నాథం కూడా అలాగే ప్రవర్తిస్తున్నాడు. రూపాయలంటే అతనికిప్పుడు ఉత్తకాగితాలే! భార్యా పిల్లలు జీవన్నాటకంలో పాత్రలే? తామంతా విధి చేతిలో కీలుబొమ్మలే!

చిత్తూరు, అనంతపూరు బార్డర్లో ఉన్న మల్లెల చెరువు జగన్నాథంది. అతనికిద్దరు కొడుకులు. సంపద గలిగిన చోట పరపతీ, పరపతి ఉంటే మర్యాదా ఉంటాయి గనగ జగన్నాథానికన్నీ ఒనగూరినట్టే. పెద్ద కొడుకు చైతన్యను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ని చేసి అమెరికా పంపాడు. రెండోవాడు చిన్మయ అంతగా చదువుకోలేకపోయాడు.

వ్యవసాయానికీ, వ్యాపారానికీ, మధ్య ఊగులాడాడు కొన్నాళ్ళు. వ్యవసాయాన్ని నమ్ముకుంటే మిగిలేది చిప్పేనని తేల్చుకుని చివరికి రెండోదైన వ్యాపారానికి చదువుని ముడిసరుకుగా ఎన్నుకుని ఒక జూనియర్ కాలజీ తెరిచాడు. ఆ ప్రాం తాల్లో జూనియర్ కాలేజి లేకపోవడంవల్ల చాలామంది మల్లెలచెరువు కాలేజిలో చేరారు. ప్రస్తుతం కొందరు భాగస్వాములతో కలిసి ఇంజనీరింగు కాలేజి తెరిచే ప్రయత్నంలో ఉన్నాడు చిన్మయ.

ఇలా సజావుగా సాగిపోతున్న జగన్నాథం జీవితంలో ఒక పెను తుఫాను వీచింది. అదే అతని అనారోగ్యం! ఎన్నెన్నో ఆస్పత్రుల్లో చూపించుకున్నాడు. కొందరు డాక్టరునరాల జబ్బనీ, మరికొందరు కండరాల్లో జబ్బనీ మరికొందరు ఎముకల్లో జబ్బని రకరకాల మందులు తినిపించారు. చివరికి ''నీకే జబ్బూ లేదు. నువ్వు సైకలాజికల్‌గా జబ్బున్నట్టు ఫీలవుతున్నావ్'' అని పంపేశారు.

దేహంలో ప్రతి అణువులోనూ అలివికాని బాధ అతనికి. చిక్కి శల్యమైనాడు. ఇక ఇంటివాళ్ళు కూడా ఆశలొదులు కుంటున్నారు. ఈ పరిక్రమణలో చాలా సహజంగా ఇంటి అధికారం తన చేతుల్లో నుంచి జారిపోతుండడం అతన్ని మరింత మానసిక హింసకు గురి చేస్తున్నది.

''ఎంత సంపాదించి ఏంలాభం? దానిమీద ఎవ్వడూ పీఠమేసుకుని కూచునేది లేదు. ఈ నిజం అందరికీ తెలిసిందే! ఐనా పాకులాట! తనుమాత్రం? అనంతపూర్లో చదివేటప్పుడు కాలేజి పాలిటిక్స్‌లో ప్రెసిడెంట్ పదవి

పొందడం కోసమూ, తను మనసారా ప్రేమించిన లావణ్య ప్రేమను పొందడంకోసమూ, ఎన్ని పాట్లు పడ లేదు.

ఐతే చివరికేం జరిగింది? కాలేజి ప్రెసిడెంటు పదవి శాశ్వతంగా నిలబడిందా? పోనీ ప్రేమించిన లావణ్యాని పొందగలిగాడా? డబ్బుకోసం ఈ కౌసల్యని పెళ్ళి చేసుకున్నాడు. పిల్లలనుకున్నాడు. పాపం లావణ్య ఎక్కడుందో? తర్వాత ఊళ్ళో నాయకత్వం కోసం, తండ్రి ఇచ్చిన ఆస్తి వృద్ధి చేసుకోడంకోసం, చైతన్యను అమెరికా పంపడంకోసం, చిన్మయ ఇంజనీరింగ్ కాలేజికోసం ఎన్ని పరుగులు దీశాడు! ఆలోచిస్తే ఇప్పుడంతా అర్థంలేని పరుగులా అనిపిస్తూంది. మనిషి ఇలా జీవితమంతా అర్థంలేని పరుగులు తీస్తూ చివరికి ఎక్కడో ఒక చోట గుంటలో శాశ్వత సమాధి అవుతాడు''

ఇలా ఆలోచిస్తూ మగత నిద్రలోకి జారుకున్నాడు జగన్నాథం. రంగయ్య హడావుడిగా వచ్చి ''అమ్మయ్యా'' అని కౌసల్యమ్మను పిలుస్తుండడంతో ఉలిక్కిపడి లేస్తూ ''ఏందిరా రంగా?'' అన్నాడు.

''ఇప్పుడే వస్తానప్పా. అమ్మయ్యతో కొత్తపనుంది''

''ఏంపని? ఎందుకట్లా ఉరకతా ఉండావు?''

''నిదానంగా సెప్తానప్పా. ఇప్పుడర్జెంటుగా పోవాల''

''ఎక్కడికి? ఎందుకు? చెప్పి కదులు''

''మల్లొత్తాగా, అప్పుడ సెప్తా''

''ఏంది మల్లొచ్చేది. గోడౌన్ ఉరస్తా ఉందన్నావే! కప్పించినావా?''

''అయ్యన్నీ మేం జూసుకుంటాంలేప్పా. నువ్వు నిమ్మళంగా పడుకోరాదా?''

జగన్నాథం వైరాగ్యమంతా ఏమైందోగాని రంగయ్య మీద కోపం ముంచుకొచ్చి అతన్ని తిట్టసాగాడు.

ఈ అరుపులికి కౌసల్యమ్మ కంగారుగా వచ్చి ''అరే! ఏందయ్యా! అట్లా అరుస్తా వుండావు!'' అంది.

''నేనడిగే దానికి వాడు జవాబు చెప్తావుంటే గదా? వాడిట్లా చెయ్యడానికి నువ్వే కారణం. నీవల్లే కళ్ళు నెత్తికెక్కినయ్ వాడికి''

''అయ్యో రామా! నీకు రాన్రానూ చిరాకెక్కువైతా వుంది. నలుగురూ ఇంటే బగిసీనమైతాదని మర్చిపోబాకు''

''మనమొఖాలకి బగిసీనమొకటా? గోడౌన్ కప్పు రిపేరీ అయిందా? వాడేడి చిన్మయ?''

''ఏందయ్యా? అన్నీ నీకే పట్టినట్టు? ఒక్కపినగూడా కాదు నీవల్ల. చూస్కొనేవాళ్ళు వేరే వుండారుగా. నీకెందుకు?''

''నోర్ముయ్యి''

ఇలా ఇద్దరూ అరుచుకుంటూంటే కోడలు బైటికొచ్చి నిర్ఘాంతపోయి నిలబడ్డది.

''అప్పా. నేనిప్పుడే మనుసుల్ని పిల్చకొచ్చి గోదాము కప్పు ఒదిలొచ్చినా గదా. ఒల్లు బాగలేనోడివి. ఇస్రాంతి దీస్కో'' అన్నాడు రంగయ్య.

''ఈ కూత ఇందాకనే కూసేదానికి నీకు పెద్దరోగ మొచ్చిందా?'' అంటూ రంగయ్యని తిట్టడం మొదలు పెట్టాడు జగన్నాథం.

అంతలో చిన్మయ బండిలో వచ్చాడు. అతన్ని చూసి అంతా సర్దుకున్నారు.

తండ్రి పక్కకూచుని కాసేపు మాట్లాడాడు చిన్మయ. దాంతో కాస్త శాంతించాడు జగన్నాథం. అతన్లో మళ్ళీ అంతర్మథనం ఆరంభమైంది.

''తనెందుకంత ఆవేశపడ్డాడు? ఎవరెటుపోతే తనకేల? ఎందుకరిచాడు? ఆ గోదాములూ, వాటి రంధ్రాలూ ఎటుపోతే తనకేల? ఇవన్నీ ప్రపంచంలో శాశ్వతమా? వాటిలోపలున్న వడ్లూ శనిక్కాయలూ, మిరపా, కందీ అన్నీ శాశ్వతమా? తనే పోతుంటే... వీటన్నిటి చింత తనకేల?''

సాయంత్రం డాక్టర్ బాబూరావొచ్చాడు. పరీక్ష చేసి ''బి.పీఎక్కువగా ఉందండీ'' అన్నాడు.

''అన్నిటికీ ఆత్రపడుతూ ఉంటే బీ.పీ పెరక్క తర గద్దా?'' అన్నది అక్కడే ఉన్న కౌసల్యమ్మ.

''నువ్వు పొయ్యి పన్జూసుకో'' అని కసిరాడు జగన్నాథం.

''మీకొక విషయం చెప్పాలండీ. మన జోసెఫ్ సార్ నాన్న పీటరయ్యకి ఇలాగే మొండి జబ్బొచ్చింది. జోసెఫ్ సార్ భార్య అన్నమ్మది కేరళలో ఏదో ఊరు. అక్కడికి తీసుకెళ్ళి వైద్యం చేయించారు పీటరయ్యను. ఆయనకి పూర్తిగా నయమైంది. మీరూ ప్రయత్నిస్తే మంచిది కదా'' అన్నాడు బాబూరావు.

అతని మాటలు జగన్నాథంలో కొత్త ఆశ మొలకెత్తించాయి. ''సార్. మీరు నాకోసం చాలా శ్రమపడ్డారు. ఇదుంచండి'' అంటూ బరువైన కవరొకటి బాబూరావ జేబులో కుక్కాడు.

''బాబూరావు వెళ్ళాక''ఏంతిచ్చావయ్యా డాక్టరుకు?'' అంది కౌసల్యమ్మ.

''నీకెందుకు! నీ సొమ్ముకాదుపో'' అన్నాడు.

ఆమె గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

''తనకిక్కడ మనఃశ్శాంతి లేదు. తను కేరళ వెళ్ళినా ఇంక తిరిగిరాడు. అసలు బతకాలన్న ఆశకూడా లేదు. జవసత్వాలతో ఉన్నప్పుడు ఈ ప్రపంచమంతా తన చుట్టూ తిరిగింది. ఇక ఇప్పుడు తను జీవశ్ఛవం, కనీసం కొన్నాళ్ళయినా శాంతిగా ఉండి చచ్చిపోవాలంటే... తను వెళ్ళడమే మంచిది'' అనుకుంటూ జోసెఫ్‌కి కబురు చేశాడు.

అంతావిన్న జోసెఫ్ ''మీరు బాగవుతారంటే అంత కన్నా కావల్సిందేముంది. అన్నమ్మ కేరళ పోతూ వుంది తొందర్లో. మీరామెతో బాటూ వెళ్ళొచ్చు'' అన్నాడు.

అంతేకాదు. పీటరయ్యను కూడా తోడు పంపుతా ననీ, పీటరయ్య కొన్నాళ్ళు జగన్నాథంతోపాటు అక్కడే ఉంటాడనీ చెప్పడమే గాక, జగన్నాథం కోరిక మేరకు తను కూడా వెళ్ళి జగన్నాథాన్ని ప్రకృతి వైద్య శాలలో చేర్పించివస్తాననీ మాటిచ్చాడు.

ట్రైన్లో వెళ్తున్నప్పుడు జోసెఫ్‌ని పక్కన కూచోబెట్టుకుని మాట్లాడడం మొదలుపెట్టాడు జగన్నాథం.

''జోసెఫ్! నేను కేరళ నుంచి తిరిగిరానన్న మాట వాస్తవం. అందుకే నీతో కొన్ని విషయాలు చెప్పాలి''

''అట్లా అనకండి. మీరు తప్పక సంపూర్ణారోగ్యంతో తిరిగొస్తారు. దేవుడు మీమీద కృపజూపాలని మేం ప్రార్థనలు చేస్తాము''

''హు, దేవుడు? ఎక్కడున్నాడయ్యా దేవుడు? ఉంటే నాకెందుకీ శిక్ష? నేనేం పాపం చేశాను? అసలు మన పాపపుణ్యాలను బట్టి దేవుడు శిక్ష వేస్తాడనుకోడం ఉత్త భ్రమ! ఎంతమంది పరమపాపులు సర్వసుఖాలూ అనుభ విస్తూ బ్రతకడం లేదూ? ఎంతమంది నిర్దోషులూ, పుణ్యాత్ములూ శ్రమలు పడడంలేదు? ఆక్సిడెంట్లల్లో, జబ్బుల్తో చచ్చిపోవడం లేదు?''

''అలా అనకండి. దేవుడి లీలలు మనం అర్థం చేసుకోడం కష్టం''

''కాని ఒక్కటి మాత్రం చెప్పగల్ను. ఆ దేవుడ్ని నమ్మ బట్టే నువ్వు నాకీ రోజు ఈ మేలు చేస్తున్నావు. 'నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించు' అన్న మీ ప్రభువు మాట నిజం చేశావు. నీపట్ల ఎంతో క్రూరంగా ప్రవర్తిస్తూ వచ్చిన నన్ను క్షమించావు''

అతని కళ్ళల్లో నీళ్ళు చూసి జోసెఫ్ కళ్ళు కూడా చెమర్చాయి.

''కులం మతం పేరుతో నిన్నెంతో సతాయించాను. అదంతా మర్చిపో. నన్ను క్షమించు''

''అవన్నీ నేనెప్పుడో మర్చిపోయాను. కాని మీరవన్నీ

## తెలుగు నేల - ఆంగ్ల గోల

తెల్లవారితే చాలు... 'తెల్ల'భాష
తెలుగు నేలంతా ఆంగ్ల గోల
'గుడ్ మార్నింగ్' మొదలు
'గుడ్ నైట్' వరకూ
ఇంగిలీషు 'ఛా'నెళ్ళు 'మిడ్‌నైట్' వరకూ
మనం నివసించేది గోదావరి-కృష్ణా నదుల తీరం
మనం తాగ్రేది తెలుగు నీరం
మనం పీల్చేది తెలుగు సమీరం
అయినా... ఆంగ్ల ఆరా'ధనం' మహాఘోరం
ఆంధ్ర దేశాన నేడు ఆబాలగోపాలం
తెలుగు భాషను 'మరచి'
ఆంగ్ల మాధ్యమంలో తమను తామే 'మైమరచి'
చరించటం విడ్డూరం!
తెలుగు నోట ఎంగిలి ఇంగిలీషు 'గలీజు'
ఎందుకు మనకీ గ్లోబల్ విలేజు?
అందరికీ అమెరికా -ఆస్ట్రేలియాల 'మోజు'
(కోట్లు-కోట్లు సంపాయిస్తున్నట్లే అందరి 'పోజు')
'తెలుగు పద్యం' ఆంధ్రుల అదృష్టం!
ముందుగానే 'రైమ్స్' ఎందుకు ముదనష్టం?
ముందు మన పిల్లలకు నేర్పండి 'లోకల్' భాష
ఆ పిదప నేర్పించ వచ్చు 'లోకుల' భాష
'ఇంట'గెలిచి 'రచ్చ' గెలవాలి
ముందు ఇంట్లో విషయాలు
ఆ తరువాతే... ఇంటర్‌నెట్ 'విష'యాలు
ఆంగ్లం మన మాతృభాషను బంధించిన 'ఉచ్చు'
ఆంగ్లం మన సంస్కృతీ-సంప్రదాయాలను

55

54

తగలెడుతున్న 'చిచ్చు'

అర్థంకాకున్నా ఆంగ్లంలో అభ్యసించటం నేడు ఓ

'ఎచ్చు'

బోలెడంత 'ఖర్చు' 'పైపెచ్చు'

ఒకే ఒక్క తెలుగు పద్యం చదివితే చాలు...

అది మన జీవితానికి సరిపడు వెలుగునిచ్చు

అక్షరాభ్యాసం నాడే... ఏబిసిడిలు

రుద్దించటం నేటి దురభ్యాసం

'ఓనమా'ల ఆనవాలు లేని

ఆంగ్ల సహవాసం

సొంత ఊరొదిలి కానని గంతలకెళ్ళి...

'పరాయి' పంచల్లో 'కిరాయి' నివాసం

ఇదంతా దేనికోసం...? స్వదేశీ

'జీవితం' పాడుచేస్తున్న 'విదేశీ జీతం'కోసం

ఏవన్నా అంటే... అందరికీ కోపం...

ఏం చేస్తాం... అంతా 'విధి'విలాసం...

ఆంధ్రులు గ్రోలు 'మధుర మకరందం' తెలుగు భాష

ఆంధ్రులను బ్రోచు 'అమ్మ హృదయం' తెలుగు

భాష

వావివరసల వ్యాకరణం తెలుగు భాష

మనకెందుకు... అంటే... ఆం'కుళ్ళు'

అని పిలిచే భాష?

మన తెలుగు రసమయం

'ఆంగ్లం' వద్దు... అది డాబుసరి మయం.

మన తెలుగు నుడికారాలు, సామెతలు

చమత్కారాలు పొడుపు

కథలు. కథలు... ఏ భాషలోనూ

లేని తెలుగు వారి 'నిధులు'!

మన తెలుగు నన్నయ్య భాష,

మన అన్న అన్నమయ్య భాష

మహానుభావులెందరో ఇచ్చిన భాష

మహామహులెందరో మెచ్చిన భాష

మన తెలుగు భాష

నేడు మన నేల ఏడుకొణానికెళ్ళినా...

'తెలుగు దినుసుల' కొన్నవారికిచ్చేది

'ఆంగ్లరశీదులు'!

ఆంగ్ల సూదులు వదిలి 'తెలుగు' పూలను ఏరండి,

తెలుగు నేలంతా చల్లండి.

బి.యం.పి.సింగ్

తలచుకొనిఇప్పుడు మనసుపాడు చేసుకుంటున్నారు''

''కాదులే జోసెఫ్ నన్ను చెప్పనీ. నా బీరువానిండా పట్టుపంచెలూ చొక్కాలూ మూలుగుతున్నాయ్. నా బీరువా లాకర్లో హార్డ్ క్యాష్ మూడు లక్షలుంది. ఇది ఎవ్వరికీ తెలియదు. పిత్రార్జితం కాక నేను స్వయంగా సంపాదించిన భూమి పదహైదెకరాలుంది. ఇవన్నీ అనధాశ్రమానికీ వృద్ధాశ్రమానికీ, పేదపిల్లలకు దానం చేయాలి. భూమిని దళితులకు పంచిపెట్టాలి. ఈ మేరకు పత్రాలు రాసి లాయర్‌కి నిన్ననే ఇచ్చాను. నీపేర కూడా రెండెకరాల పొలం....''

''జగన్నాథం గారూ! మీకేమైనా పిచ్చిపట్టిందా?''

''లేదు జోసెఫ్! ఇంతకు ముందు పట్టిన పిచ్చి ఇప్పుడొదిలింది. ఇవన్నీ నువ్వే దగ్గరుండి జరిపించాలి. జరిపిస్తావుగా?''

''అలాగే'' అన్నాడు అతికష్టంమీద జోసెఫ్.

అన్నమ్మ రెండు పేట్లలో చపాతీలు పెరుగన్నం తెచ్చి పెట్టింది. పీటరయ్య ముందే భోంచేసి పక్కబెర్తుమీద గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

''థాంక్స్ సిస్టర్'' ప్లేటందుకుంటూ అన్నాడు జగన్నాథం.

అందరూ నిద్రపోయినా అతని అనారోగ్యం, ఆలోచనలూ అతన్ని మాత్రం నిద్రపోనివ్వలేదు.

❖ ❖ ❖

కొల్లం సమీపంలో ఉన్న ఒక ప్రకృతి వైద్యశాలలో అతన్ని చేర్పించారు. ఇంతకు ముందు పీటరయ్య ఉన్న ఆశ్రమం అదే. పీటరయ్య తన పక్కనుండడంతో

ప్రతిదానికీ కొత్త వెతుక్కునే అవసరం తప్పింది జగన్నాధానికి.

ఆశ్రమంలో తను తింటున్న ఆకులూ, కాయలూ ఇదివరలో ఎన్నడూ చూడలేదు జగన్నాథం. యోగాసనాలు చేయించడం, ఎండలో కూచోబెట్టడం, ప్రాణాయామం చేయించడం, ఎక్కువగా పాలూ, పళ్ళే ఆహారంగా ఇవ్వడం చేసేవాళ్ళు. ఏదో నూనెతో అతని దేహమంతా మర్దనా చేసేవాళ్ళు.

అలా కొన్ని రోజులు గడిచాక తన దేహంలో క్రమక్రమంగా జీవశక్తి చోటుచేసుకుంటున్నట్టు గ్రహించాడతను. ఇంతకుముందులా బరువుగాకాక తేలిగ్గా శ్వాసాడుతోంది. తలనొప్పి పూర్తిగా తగ్గిపోయింది. ఒళ్ళు తేలికైంది. జఠరాగ్ని బాగా రగులుతోంది. నడవాలన్న ఉత్సాహం కలిగింది. ఒక పక్క వైరాగ్య చింతనలు కొనసాగుతున్నా మరోపక్క కొత్తాశలు మోసులేశాయి.

అలా ఆరు నెలలు గడిచింది.

❖ ❖ ❖

జగన్నాధం మల్లెల చెరువుకు తిరిగొచ్చాడు.

అతను జగన్నాధమంటే ఎవరూ నమ్మరు. కాస్త ఒళ్ళు చేశాడు. ముఖం సంపూర్ణారోగ్యాల్ని సూచిస్తూ కళకళలాడుతోంది.

అతన్ని చూడగానే భార్య కాళ్ళమీదపడి భోరుమంది. దాంతో, అతని హృదయంలో ఆమెపట్ల పేరుకున్న కోపం క్షణంలో కరిగిపోయింది.

''ఎందుకేడుస్తావు! నేను క్షేమంగా వచ్చాగా'' అన్నాడామెను లేవదీస్తూ. కోడలు దిష్టితీసింది. మనవడూ, మనవరాలూ ''తాతా'' అంటూ అల్లుకుపోయారు.

''వీళ్ళందర్నీ విడిచిపెట్టి తనిన్నాళ్ళు కేరళలో ఎట్లా ఉండగలిగాడు''అనుకున్నాడు ఆశ్చర్యంగా.

మధ్యాహ్నం అతని రాక తెలుసుకొని అన్నమ్మా జోసెఫ్ పరుగు పరుగున వచ్చారు. జగన్నాధం ఇంట్లో లేడట. వెలుపలే కుర్చీలు వేసి కూచోబెట్టారు.

అరగంట తర్వాత జగన్నాధం వచ్చాడు. అతని చేతిలో పత్రాలున్నాయ్. కొల్లం వెళ్ళకముందు తను రాసి లాయరు దగ్గరిచ్చిన పత్రాలు తీసుకొచ్చేశాడు.

ఆరోగ్యంగా ఉన్న అతన్ని చూసి జోసెఫ్ మనసు ఉప్పొంగింది. లేచి ఆప్యాయంగా కౌగలించుకున్నాడతన్ని.

''కూచో జోసెఫ్'' విడిపించుకుంటూ అన్నాడతను.

కాసేపు అదీ ఇదీ మాట్లాడారు. మధ్య మధ్యలో జగన్నాథం ''గోడౌన్లు ఎలా ఉన్నయ్యో ఏమో! వెళ్ళి చూడాలి'' అంటున్నాడు.

ఇంతసేపూ, ఎండలో వచ్చిన వాళ్ళకి ఎవ్వరూ మంచి నీళ్ళు కూడా ఇవ్వలేదు.

ఇంతకుముందు అన్నమ్మను ఆప్యాయంగా 'సిస్టర్' అని పిలిచే జగన్నాధానికి ఆ సంబోధనెంత మాత్రం గుర్తు లేదు. తనకోసం ఒక్కనెల ఆశ్రమవాసం చేసిన పీటరయ్య యోగ క్షేమాలు విచారించనేలేదు. అతని వాలకం గమనించడానికి వాళ్ళకెంతోసేపు పట్టలేదు.

కుమ్మరి గంగసామి ఆత్రంగా వచ్చి ''అప్పా. నువ్వు బాగైనావంతే సాలు. అంతా ఆ బగమంతుని దయ'' అన్నాడు చేతులు జోడించి.

''అది సరేలే. ఆ ఐదువేల మాట మరిస్తివా ఏం'' అన్నాడు జగన్నాధం.

''వెళ్ళొస్తామండీ'' అంటూ లేచారు జోసెఫ్ దంపతులు.

దార్లో ''అతనెలాంటి వాడైతే మనకెందుకు? మన డ్యూటీ మనం చేశాం'' అన్నారు జోసెఫ్ అన్నమ్మతో. ఆమె ఏమీ మాట్లాడలేదు.

ఇంటికెళ్ళేసరికి పీటరయ్య చలువపంచ కట్టుకొని, ఆముదం పెట్టి తలదువ్వుకొని, సిద్ధమైయున్నాడు.

''ఒరే జోసెఫూ! ఎట్టుండాడు జగన్నాధం? నేనూ పొయ్యి చూసి రావాలని సిద్ధమైనా'' అన్నాడు.

''అతను బాగానే ఉన్నాడులే నాన్నా! కాని నువ్వు మాత్రం అక్కడికి పోనవసరం లేదు'' అంటున్న కొడుకుని చూసి నిర్ఘాంతపోయాడు పీటరయ్య. ■

## డబ్బు కిటుకు

రూపాయిని
పాపాయికి మల్లే
ఎత్తుకు తిరిగేవోడు
కుచేలుడైనా సరే
కుబేరుడవుతాడు
నీళ్ళల్లా
ఒలికించుకున్నోడు
అమీరైనా సరే
గరీబు కాకపోడు

బద్ది నాగేశ్వరరావు